# గుడిసె వాసుల గుండెల్లో పిడుగు

## సారథినగర్‌లో 35 ఏండ్లుగా గుడిసెల్లో నిరుపేదల నివాసం

**ఖాళీ చేయాలని అధికారుల అల్టిమేటం**

**ముగిసిన సర్వే, గుడిసెవాసుల ఆందోళన**

**స్థలం తమదేనంటూ రంగంలోకి బయటి వ్యక్తులు**

**భూమిపై పెద్దల కన్ను, అధికారులపై అనుమానాలు**

ఎర్రగడ్డ, జనవరి 9: హైదరాబాద్ సారథినగర్‌లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు రెవెన్యూ అధికారులు పిడుగువేశారు. తక్షణమే గుడిసెలు ఖాళీ చేయాలని హుకుం జారీచేశారు. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే మోతీనగర్ నుంచి బోరబండ వెళ్లే ప్రధాన రహదారి పక్కన సారథినగర్ వద్ద ఉన్న సుమారు 1200 గజాల ఖాళీ స్థలంలో నిరుపేదలు 35 ఏండ్ల క్రితం గుడిసెలు వేసుకున్నారు. ఖైరతాబాద్ రెవెన్యూ మండలం, యూసుఫ్‌గూడ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 128లో ఉన్న సదరు స్థలంలో 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. గురువారం ఉదయం హఠాత్తుగా రెవెన్యూ అధికారులు, పోలీసులు గుడిసెల వద్దకు చేరుకున్నారు. ఆ స్థలాన్ని సర్వే చేసిన అధికారులు, ఖాళీ చేసి వెళ్లిపోవాలని గుడిసెవాసులకు హుకుం జారీ చేశారు. 'మీరు ఉంటున్న స్థలానికి సంబంధించి ఏవైనా పత్రాలుంటే రెడీ చేసుకోండి.. మళ్లీ వచ్చి పరిశీలిస్తాం' అంటూ రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



సర్వే నంబర్ 128లో 35 ఏండ్లుగా ఉంటున్న గుడిసెలు

### గుడిసె అడ్రస్‌తోనే ఆధార్ కార్డులు

సారథినగర్ వద్ద ఉంటున్న గుడిసెవాసులందరికీ ఆ చిరునామాతోనే ఆధార్, ఓటరు కార్డులు జారీ అయ్యాయి. జలమండలి ద్వారా రోజుకు రెండు ట్యాంకర్లతో నీటి సరఫరా కూడా జరుగుతున్నది. అక్కడుంటున్న కుటుంబాల్లో చాలా మంది కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గుడిసెలను కాపాడాలని అధికారుల అల్టిమేటంతో ఆవేదన చెందుతున్నారు.

### రంగంలోకి బయటి వ్యక్తులు

గుడిసెలున్న స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వే చేసి వెళ్లిన కాసేపటికి కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చారు. ఆ స్థలం తమదేనని, తక్షణమే ఖాళీ చేసి వెళ్లిపోవాలని తేల్చిచెప్పారు. భూముల ధరలు భారీగా పెరగడంతో ఆ స్థలంపై కొందరి కన్నుపడిందని, అందుకే భూమిని దక్కించుకునేందుకు స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### సగం జీవితం ఈ గుడిసెలనే గడిచింది



35 ఏండ్ల కింద పొట్ట చేత పట్టుకొని వచ్చినం. ఎండ, వాన, చలికి తట్టుకొని ఉంటున్నం. నాకిప్పుడు 75 ఏండ్లు. సగం జీవితం ఈ గుడిసెల గడిచింది. చాలా దినాల కింద నా భర్త చనిపోయిండు. గుడిసె ఖాళీ చెయ్యాలని చెప్పి వెళ్లిన్రు. యాడికి వెళ్లాలె. ఎట్లుండాలె. ఏ తోవ చూపియ్యకుండ వెళ్లిపొమ్మంటే ఎట్లా.

*-జిన్నాబాయి, సారథినగర్.*

### ఈడనే పుట్టిన..



నాకు ఊహ తెలియనప్పుడు మా అమ్మ, నాన్న ఇక్కడికి వచ్చి గుడిసె వేసుకున్నరు. నేను ఇదే గుడిసెల పుట్టిన. నాకు పెండ్లి అయింది. పిల్లలు కూడా అయినారు. అందరం ఒక్క గుడిసెలోనే ఉంటున్నం. పూట గడవటం చాల కష్టంగ ఉన్నది. కూలీ పని చేసుకుని బతుకుతున్నం. గరీబోళ్లని సర్కారోళ్లు ఆదుకోవాలె కాని.. కష్టాల పాలు చేస్తే ఎట్ల?

*- నీలమ్మ, సారథినగర్*

## జలమండలికి కొత్త జూనియర్ అసిస్టెంట్లు



సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ ): జలమండలికి కొత్తగా 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ ( పీ అండ్ ఏ, ఎఫ్ అండ్ ఏ) నియమితులయ్యారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షల్లో ఉద్యోగం సాధించిన వీరిని ప్రభుత్వం జలమండలికి కేటాయించింది. ఈ మేరకు గచ్చిబౌలిలోని ఈస్కీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను గురువారం ఎండీ అశోక్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, ఈస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు, సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

రవీంద్రభారతి,జనవరి9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను మరోమారు మోసం చేయకుండా 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేదంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లపల్లి అంజి అధ్యక్షతన 20 బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్‌చేయాలని కోరారు. సుప్రీం కోర్టు




మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు చేసి అసెంబ్లీ చట్టం చేస్తే చట్టపరమైన న్యాయపరమైన అవరోధాలు ఉండవన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ,జడ్పీటీసీ, వార్డు మెంబర్లలో 42 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించారని, ఇచ్చిన హామీ ప్రకారం చట్టాన్ని తీసుకువచ్చి ఎన్నికలను నిర్వహించాలని, లేదంటే బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. అవసరమైతే రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు,కులసంఘాలు,మేధావులతో కలిసి గుజ్జర్ల తరహాలో ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నిమ్మల వీరన్న, మోదీ రామ్‌దేవ్,మల్లేష్, పి.సతీష్

## ఓన్ యువర్ బాడీ పుస్తకావిష్కరణ

ఏఐజీ దవాఖానలో ప్రజా ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా 'ఓన్ యువర్ బాడీ' పుస్తకాన్ని ఏఐజీ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రముఖ హెపటాలజిస్ట్ డా.శివకుమార్ సరిన్ గురువారం ఆవిష్కరించారు. చిత్రంలో డా.జీవీ రావు, డా.బీవీఆర్ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




## ఐఎంటీఎంఏ, ఏస్‌మైక్రోమాటిక్‌ల ఒప్పందం



సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): ఇండియన్ మెషిన్ టూల్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఐఎంటీఎంఏ, ఏస్ మైక్రోమాటిక్ గ్రూపుల మధ్య ఉత్పత్తుల తయారీలో శ్రేష్టత కోసం నేషనల్ ప్రొడక్టివిటీ సమిట్‌కు సంబంధించిన ఒప్పందం కుదిరిందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ఎంఓయూ ఈనెల 6న ఏస్‌మైక్రోమాటిక్ గ్రూప్ కార్యాలయ ఆవరణలో ఐఎంటీఎంఏ డైరెక్టర్ జనరల్, సీఈవో జిబక్ దాస్‌గుప్తా, ఏస్ మేనేజింగ్ డైరెక్టర్ టీకే రమేశ్ సమక్షంలో జరిగింది. ఈ ఎంఓయూ సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## సింగరేణి కాలరీస్‌తో బ్యాంక్ ఆఫ్‌బరోడా ఒప్పందం



సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): దేశంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంక్‌ల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా సింగరేణి కాలరీస్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. సింగరేణి కాలరీస్‌కు సంబంధించిన 42వేలకు పైగా ఉద్యోగుల ప్రభుత్వజీతాల ప్యాకేజీకి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, సింగరేణి ఎండీ బలరామ్‌లతో ఈనెల 5న ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ తరపున జీఎం, జోనల్ హెడ్ రితేశ్‌కుమార్, బిజినెస్ డెవలప్‌మెంట్ డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, ఏజీఎం అభిషేక్ భర్తి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి ఉద్యోగులు, పెన్షనర్లకు బ్యాంక్ తరపున పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవర్, రిటైల్ లోన్లపై స్పెషల్ ఆఫర్స్ లభిస్తాయని వారు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం**



జవహర్‌నగర్, జనవరి 9: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లంతా కాలిపోయింది.. కట్టుబట్టలతోనే రోడ్డున పడ్డాం అంటూ నిస్సహాయస్థితిలో ఉన్న బాధితులు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ రేణుకానగర్‌లో విజయ్ కుమార్, భార్య, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. విజయ్ కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కటుంబసభ్యులంతా పనులకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు విజయ్‌కుమార్‌కు సమాచారం అందించగా వచ్చి చూడగా అప్పటికే ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. తినడానికి తిండి కూడా సరిగా లేదని, మూడు రోజులుగా చలిలోనే ఉంటున్నామని బాధితులు వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సహాయం చేయాలని కోరుతున్నారు.

## మురుగునీటిని తాగునీటిగా మారుస్తా



ప్రెస్‌క్లబ్‌లో డెమో ఇస్తున్న ప్రొఫెసర్ వెంకటేశ్వర్

ఖైరతాబాద్, జనవరి 9 : 'ఎంతటి మురుగునీటినైనా స్వచ్ఛమైన తాగునీరుగా మార్చవచ్చు.. ప్రస్తుతం ఉన్న ఎస్టీపీలు అంతగా శుద్ధి చేయవు...కానీ తాను పరిశోధన చేసి కనిపెట్టిన పద్ధతిలో వంద శాతం నీటిని తాగునీటి యోగ్యంగా మార్చవచ్చు' అని ఓయూ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నీటి శుద్ధిపై డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తామని, అందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని, కాని అతి తక్కువ ఖర్చుతోనే నీటిని శుద్ధి చేయవచ్చన్నారు. వంద ఎంఎల్‌డీ నీరు ప్రవహించే బల్కాపూర్ నాలాను సీవీఆర్ పద్ధతిలో ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో శుద్ధి చేయవచ్చన్నారు. 5 నుంచి 8 పైసలకు ఒక లీటరు నీటిని శుభ్రం చేయవచ్చని, ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే మూసీ నది, హుస్సేన్‌సాగర్‌లను శుద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట మాజీ మైనార్టీ కమిషన్ సభ్యులు సాల్మన్ రాజు, అర్వింద్ కుమార్ ఉన్నారు.

## నేటి నుంచి నూనె గింజల ఉత్పత్తిపై సదస్సు

సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ) : నూనెగింజల ఉత్పత్తి, నూనెల తయారీ విధానంలో అందుబాటులో ఉన్న అధునాతన టెక్నాలజీపై అవగాహన కల్పించేలా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో రెండు రోజుల జాతీయ సదస్సు జరగనుంది. నేడు ప్రారంభమయ్యే యాన్యువల్ కన్వెన్షన్ ఆఫ్ ఆయిల్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా సదస్సులో నూనె ఉత్పత్తులకు అవసరమైన అధునాతన టెక్నాలజీపై జాతీయ స్థాయి లో పలు సంస్థలకు చెందిన నిపుణులు పాల్గొనున్నారు.

## చర్లపల్లి రైల్వే టర్మినల్ నుంచి బస్సుల రాకపోకలు

సిటీబ్యూరో, జనవరి 9 ( నమస్తే తెలంగాణ ) : చర్లపల్లి రైల్వే ఆపరేషన్స్‌లో భాగంగా ఆర్టీసీ అధికారులు బస్సు రాకపోకలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ బ్లూ సీ హోటల్ నుంచి చర్లపల్లి రైల్వే టర్మినల్ ఫ్లాట్ ఫాం 1 వరకు ఉదయం 4.30గంటల నుంచి రాత్రి 10.30 వరకు బస్సులు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని, హబ్సిగూడ, నాచారం మీదుగా బస్సులు వెళుతాయని తెలిపారు. చర్లపల్లి రైల్వే టర్మినల్ నుంచి చంగిచర్ల, ఉప్పల్, రామంతాపూర్ మీదుగా బోరబండ వరకు 40 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ఆక్జెన్ యాప్‌తో కరెంట్ అకౌంట్

కొండాపూర్, జనవరి 9 : చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు రెండు నిమిషాల్లోనే కరెంట్ అకౌంట్‌ను పొందేలా బీటెక్ విద్యార్థి రూపొందించిన ఆక్జెన్ యాప్ ఉపయోగకరంగా మారనుంది. మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ఐటీ)లో బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి ఉమా సూర్య శ్రీనివాస్ తమ బృందంతో కలిసి యాప్‌ను తయారు చేశాడు. తమ పాన్ కార్డు వివరాలతో పాటు తాము కొనసాగిస్తున్న వ్యాపార స్టోర్‌ల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే వివరాలను వెరిఫై చేసి, అర్హులైన వారికి వెంటనే కరెంట్ ఖాతాను పొందేలా చేస్తుందన్నారు. యాప్‌ను అతి త్వరలోనే లాంచ్ చేసి, ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

## ఇక నుంచి పోలీసు సేవలపై ఫీడ్‌బ్యాక్

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): పోలీసులు అందిస్తున్న సేవలు ప్రజల్లోకి సక్రమంగా వెళ్తున్నాయా లేదా, పోలీసు సేవలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా లేదా తదితర అంశాలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు సేవలపై ప్రజాభిప్రాయం సేకరించేందుకు తెలంగాణ పోలీసు శాఖ తిరిగి శ్రీకారం చుట్టింది. బీఆర్‌ఎస్ హయాంలోనే ఫీడ్‌బ్యాక్ సెంటర్లు పనిచేశాయి. పోలీసు సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటూ పోలీసు సేవలను సంస్కరిస్తూ దేశంలోనే తెలంగాణ పోలీసును బెస్ట్ పోలీస్ అని నిరూపించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీడ్‌బ్యాక్ సెంటర్లు అటకెక్కాయి. దీంతో పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయనే ఆరోపణలు రావడం, నేరాలు సైతం పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి పాత విధానానికే జై కొట్టింది. ఇందులో భాగంగానే గురువారం డీజీపీ జితేందర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు..

పోలీసు సేవలపై ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చవచ్చు. అందుకోసం పోలీసు శాఖ కొత్తగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రజలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు పోలీస్ స్టేషన్‌ల వివరాలు, ఇతర పోలీసు కార్యాలయాలు వంటివి డిస్‌ప్లే అవుతాయి. అంతేకాకుండా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కాల్ సెంటర్ ద్వారా కూడా నేరుగా ప్రజలు పోలీసు సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియపర్చవచ్చు.

**వీటిపైన అభిప్రాయాలు తెలియచేయవచ్చు:**

- పిటిషన్ సమర్పించడం
- ఎఫ్ఐఆర్ నమోదు అంశంలో
- ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్
- ట్రాఫిక్ ఈ-చలాన్స్
- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్
- ఇతర అన్ని రకాల పోలీసు సేవలు

## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : బోలక్‌పూర్, బౌద్ధనగర్ డివిజన్లలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్, రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, నాలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యత అని, సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. భోలక్‌పూర్‌లో ఇంటర్ లింకు రోడ్లకు, రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు మేయర్ సూచించారు. బౌద్ధనగర్‌లో రోడ్లు, బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మేయర్ వెంట రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, సీఈ భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలి




రైతులతో సమావేశమైన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, జనవరి 9 : మండల పరిధిలోని బేగరికంచె సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 2 కోట్లు ఇవ్వాలని లేదంటే నష్టపరిహారంతో పాటు ఎకరాకు పుల్లింగ్ ద్వారా 1750 గజాలు, ఉద్యోగం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డితో పాటు భూసేకరణ ఆర్డీవో రాజు లేమూరు రైతులతో సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న లేమూరు రైతులకు ఎకరాకు రూ. 90లక్షలు,రాచులూరు రైతులకు రూ. 60లక్షలు, తిమ్మాపూరు రైతులకు ఎకరాకు రూ. 70 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలుపగా రైతులు ఒప్పుకోలేదు. మాజీ సర్పంచ్ గణేశ్ ముదిరాజ్, లిక్కి జంగారెడ్డి, ఎలుక సంజీవ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 9 : జనాభా ప్రాతిపదికన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కోరారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో కీసర మండల మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఓయూలో ఫిబ్రవరి 2న నిర్వహించే మాదిగ విద్యార్థి యువగర్జన కార్యక్రమానికి మాదిగలంతా పెద్ద ఎత్తును పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మీసాల మల్లేష్, నర్సింగ్‌రావు, కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, మల్లేష్, నర్సింహ, బాలయ్య, లింగం, స్వామి, కుమార్, జంగయ్య పాల్గొన్నారు.




వాహనాల రద్దీతో నగర ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్లపైన్నే గంటలతరబడి వాహనాలు నిలిచి పోవడంతో అసహనానికి గురవుతున్నారు. గురువారం పంజాగుట్టలో కిక్కిరిసిన వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

## రాబోయే ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైహింద్ గౌడ్, చెన్నరాములు ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్

ఖైరతాబాద్, జనవరి 9 : రాబోయే ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి చేసుకోవాలని నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వెనుకబడిన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ అధ్యక్షతన తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్ర స్థాయి బీసీ నేత చర్చా వేదిక జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జైహింద్ గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉన్నా పదవులు మాత్రం అగ్ర వర్ణాలు అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ చివరి అగ్రవర్ణ ముఖ్యమంత్రిగా మిగిలిపోతారని, వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకొని, ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశ్రాంత కానిస్టేబుల్ శ్రీశైలం ముదిరాజ్‌ను బీసీలందరూ మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు డాక్టర్ శివ ముదిరాజ్, ఉడుత మల్లేశం, బత్తుల సిద్దేశ్వర్, మహేశ్ గౌడ్, కొండా లలితా బాయి, మమతా గౌడ్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

## జన్యుశాస్త్రంపై అవగాహన ఉండాలి



ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్

ఖైరతాబాద్, జనవరి 9 : హైటెక్స్‌లో జరుగుతున్న 62వ పెడికాన్ జాతీయ సదస్సులో భాగంగా నిమ్స్ మెడికల్ జెనెటిక్స్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్తాధ్వర్యంలో క్లినికల్ జెనెటిక్స్‌పై ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈవర్క్ షాప్‌ను నిమ్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ లీజా రాజశేఖర్, మెడికల్ జెనెటిక్స్ విభాగం ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్విన్ దలాల్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి వైద్యుడికి జన్యుశాస్త్రంపై అవగాహన ఉండాలని, తద్వారా పిల్లలు, పెద్దల్లో వచ్చే రోగ నిర్ధారణ, వైద్య చికిత్సలకు ఎంతో దోహదపడుతుందన్నారు.